


# కరపత్రం

SINCE 2014

శనివారం జులై 26 2025 సంపుటి :0 సంచిక :281 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

## 'ఒక చాయ్ వాలా.. మరో చాయ్ వాలాకు':

### ప్రధానికి టీ రుచి చూపిన అఖిల్ పటేల్





- ప్రధాని నరేంద్ర మోదీ యూకే పర్యటనలో భాగంగా భారతీయ యువ వ్యాపారవేత్త స్వయంగా తయారుచేసిన టీని ఆస్వాదించారు.
- ఈ కార్యక్రమంలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కూడా పాల్గొన్నారు.
- చెకర్స్‌లో మోదీ, కీర్ స్టార్మర్‌తో "చాయ్ పే చర్చ" జరిగిందని, ఇది భారత్-యూకే సంబంధాలను బలపరుస్తోందని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.
- ప్రధానితో ముచ్చటించిన ఆ కుర్రాడు అఖిల్ పటేల్. ఇతను భారతీయ మూలాలున్న యువకుడు.

ప్రధాని నరేంద్ర మోదీ యూకే పర్యటన లో భాగంగా భారతీయ యువ వ్యాపారవేత్త స్వయంగా తయారుచేసిన టీని ఆస్వాదించారు. ఆయనతోపాటు.. బ్రిటన్ ప్రధాని కీవ్ స్టార్మర్ కూడా ఉన్నారు. మోదీ ఈ ఫొటోలను ఎక్స్‌లో పోస్టు చేశారు. 'చెకర్స్‌లో మోదీ, కీవ్ స్టార్మర్‌తో 'చాయ్ పే చర్చా' .. భారత్–యూకే సంబంధాలు బలపడుతున్నాయి' అని క్యాప్షన్ యాడ్ చేశారు. అయితే ప్రధానితో ముచ్చటిస్తున్న ఆ కుర్రాడు ఎవరా..? అని అందరూ ఆన్‌లైన్‌లో చర్చించుకొంటున్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం ప్రధాని మోదీ ఇటీవల యూకేను సందర్శించారు. పేజి 2లో ▶

## తెలంగాణ మంత్రిమండలి సమావేశం వాయిదా



హైదరాబాద్: సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించాల్సిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం వాయిదా పడింది. ఏఐసీసీ సమావేశంలో పాల్గొనేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి దిల్లీలోనే ఉన్నారు. వీరితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దిల్లీ పర్యటనలో ఉన్నారు. ఐదుగురు మంత్రులు దిల్లీలోనే ఉండటంతో క్యాబినెట్ సమావేశం వాయిదా వేయాలని సీఎం నిర్ణయించారు. ఈనెల 28న మధ్యాహ్నం 2 గంటలకు క్యాబినెట్ భేటీ నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## ఓబీసీల చరిత్రను ఆర్ఎస్ఎస్ చెరిపేసింది

### : రాహుల్ గాంధీ ఆరోపణలు



దిల్లీ: భారత ఉత్పాదక శక్తికి ఓబీసీలు ప్రతీకలని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. అలాంటి వారికి అన్ని రంగాల్లో వివక్ష ఎదురవుతోందని ఆరోపించారు. దిల్లీలో జరిగిన బాగిదారి న్యాయ మహా సమ్మేళనం కార్యక్రమంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాజపా, ఆర్ఎస్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. ఓబీసీల చరిత్రను ఉద్దేశపూర్వకంగా చెరిపేశారని దుయ్యబట్టారు."2004 నుంచి నేను రాజకీయాల్లో ఉన్నాను. ఈ రెండు దశాబ్దాల కాలం వెనుదిరిగి చూసుకుంటే.. ఓబీసీల ప్రయోజనాలను కాపాడటం కోసం నేను చేయగలిగినంత చేయలేకపోయానని అనిపిస్తోంది. పేజి 2లో ▶

## కేసీఆర్ మళ్లీ సీఎం

### అయితేనే రాష్ట్రాభివృద్ధి: కేటీఆర్



- పెట్టుబడి సాయం: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయాన్ని ఎకరానికి రూ.10 వేల నుండి రూ.15 వేలకు పెంచుతామని చెప్పి, రెండు సార్లు ఎగ్గొట్టిందని విమర్శించారు.
- దళితబంధు: దళితబంధు కింద రూ.10 లక్షలు ఇస్తుంటే, కాంగ్రెస్ రూ.12 లక్షలు ఇస్తామని చెప్పిందన్నారు.
- కౌలు రైతులకు సాయం: కౌలు రైతులకూ పెట్టుబడి సాయం చేస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయలేదని ఆరోపించారు.

కామారెడ్డి: కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కామారెడ్డి జిల్లా లింగంపేటలో నిర్వహించిన 'ఆత్మగౌరవ గర్జన' సభకు ఆయన హాజరై మాట్లాడారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం ఆధారంగానే రాష్ట్రాన్ని తెచ్చుకున్నామన్నారు. కరోనా సమయంలోనూ తమ ప్రభుత్వం ఏ పథకాలు ఆపలేదని చెప్పారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో ఓటుతో కాంగ్రెస్ నేతలకు బుద్ధి చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు."పెట్టుబడి సాయం ఎకరానికి రూ.10వేలు ఇస్తే.. కాంగ్రెస్ రూ.15వేలు ఇస్తామని చెప్పింది. దళితబంధు కింద రూ.10లక్షలు ఇస్తుంటే.. కాంగ్రెస్ రూ.12లక్షలు ఇస్తామంది. రెండు సార్లు రైతులకు పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టింది.

## హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌కు ఎస్తోనియా సహకారం తీసుకుంటాం



- డ్రోన్ టెక్నాలజీలో తెలంగాణ గణనీయ అభివృద్ధి సాధించిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.
- హైదరాబాద్‌లో తయారైన డ్రోన్లు 'ఆపరేషన్ సింధూర్'లో పాకిస్థాన్‌కు భారీ నష్టం కలిగించాయని చెప్పారు.

## కాంగ్రెస్‌కు రఘునందన్ పాఠాలు అవసరం లేదు: ఆది శ్రీనివాస్



హైదరాబాద్: భాజపా అగ్రకుల పార్టీ అని, బీసీ బిల్లుకు ఆమోదం తెలపకుండా ఆ పార్టీ నేతలు అనవసరమైన మాటలు మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆక్షేపించారు. బిల్లును ఆమోదించాలని కేంద్రం, భాజపా అధిష్ఠానాన్ని ఎంపీ రఘునందన్‌రావు ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కావొద్దని ఆయన కోరుకుంటున్నారని మండిపడ్డారు.

## ఏపీ, తెలంగాణలో

### నియోజకవర్గాల పునర్విభజనపై పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు



- 170(3) అధికరణం ప్రకారం ఏపీ విభజన చట్టంలోని సెక్షన్ 26కి పరిమితి ఉంది.
- 2026లో మొదటి జనగణన తర్వాతే డీలిమిటేషన్ నిర్వహిస్తారు.
- ఇలాంటి వ్యాజ్యాలను అనుమతిస్తే ఇతర రాష్ట్రాల నుంచి కూడా పునర్విభజన పిటిషన్లు వస్తాయి.
- కేంద్రపాలిత ప్రాంతాలతో పోలిస్తే రాష్ట్రాల్లో నిబంధనలు భిన్నంగా ఉంటాయి.

2లో..

## సంపాదకీయం

# అరణ్యవాసంలోనే విప్లవప్రభాతం

విప్లవం ఏమిటి? విప్లవ సాధనకు హింస తప్పనిసరి అని విశ్వసిస్తారు. సాయుధ పోరాటంతో విప్లవాన్ని ముడిపెడతారు. విప్లవానికి తుపాకీ ప్రతీక కాదు. ఒక సమాజంలోని ప్రజలు తమ దుస్తర పరిస్థితులపై తిరుగుబాటు చేసి మౌలిక మార్పులు సాధించుకోవడమే విప్లవం. 1970ల్లో భారతీయ యువత తుపాకీని తిరుగులేని విప్లవ సాధనంగా ఆరాధించేది. కారణమేమిటి? భారతీయ ప్రజాస్వామ్యం ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని సాధించకపోవడమే. పైగా కమ్యూనిస్టులు తెలంగాణ విప్లవ మార్గాన్ని విడనాడి పార్లమెంటరీ ప్రజాస్వామ్య మార్గానికి మళ్లారు. నా తరం విద్యార్థులు మార్క్సిజాన్ని, లెనిన్ విప్లవాత్మక కార్యాచరణను అభిమానించేవారు. ఈ ప్రభావాల కారణంగా ఆ నాటి విద్యార్థి లోకం దేశ రాజకీయాల పట్ల తీవ్ర అసంతృప్తితో రగిలిపోతుండేది. 1975 నాటికి మన దేశంలో విప్లవం విజయవంతమవుతుందని విప్లవ కమ్యూనిస్టు పార్టీ నాయకులు పదేపదే ఉద్ఘాటిస్తుండేవారు. అవును, వారి ప్రబోధాలు, ఉద్ఘోషలతో విప్లవం నిజంగానే తుపాకీ గొట్టం ద్వారా వస్తుందని పరిపూర్ణంగా నమ్మేవాళ్లం. మా స్వప్నాలను విప్లవ ఝంఝ ఊపివేస్తుండేది. ఖమ్మంలో విద్యార్థిగా ఉన్నప్పుడు నాకు ఒక తుపాకీని పంపారు. విప్లవోత్సాహంలో ఉన్న నా మిత్రులు కొంతమంది నడిగూడెంలోని ఒక బ్యాంకులో దోపిడీకి పాల్పడి అరెస్టయ్యారు వారి రాజకీయాలు అంతటితో ముగిశాయి. స్థానిక కాంగ్రెస్ నాయకుడు ఒకరిని హతమార్చేందుకు నా విప్లవ మిత్రులు పథకం రచించారని తెలిసి నేను వారితో విభేదించాను. విప్లవ కార్యకలాపాలకు దూరంగా ఉన్నాను. మార్క్స్ సిద్ధాంతాన్ని మరింతగా అధ్యయనం చేసేందుకు నేను జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో చేరాను. నా సహచర విద్యార్థులలో అత్యధికులు ఉన్నత, విద్యాధిక వర్గాల వారి విద్యా సంస్థగా పేరుపొందిన (ఢిల్లీలోని) సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుంచి వచ్చినవారే. సుదీర్ఘ చర్చలతో భారతదేశ సమస్యలకు నక్సలైట్ ఉద్యమం పరిష్కారం కాదనే నిర్ణయానికి మేము వచ్చాము. వర్గ సంబంధాలు, వర్గ పోరాటాలను మరింత లోతుగా అధ్యయనం చేయాలని నిర్ణయించుకున్నాం. సామాజిక ఆధిపత్యాలను, సామాన్యుల అస్తిత్వ పోరాటాల తీరుతెన్నులను మరింతగా అర్థం చేసుకునేందుకు తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజల భాగస్వామ్యాన్ని అవగాహన చేసుకోవడంపై నా దృష్టిని కేంద్రీకరించాను. బెంగాల్‌లోని నక్సల్‌బరీ గ్రామంలో ప్రారంభమైన నక్సలైట్ ఉద్యమం వెనుకబడిన ప్రాంతాలు అయిన ఇల్లందు, శ్రీకాకుళం, కరీంనగర్‌లో కొనసాగింది. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో వలె భూములను పేదలకు పంపిణీ చేశారు. అయితే రైతులు పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయాలలో భాగస్వాములయ్యారు. నాటి ప్రధాని ఇందిర తన మితవాద ప్రత్యర్థులను చిత్తుచేసేందుకు భూ సంస్కరణలను ప్రవేశపెట్టారు. దళితుల సంక్షేమానికి అగ్రప్రాధాన్యమిచ్చారు. అదే సామ్యవాదమని ఉధృతంగా ప్రచారం జరిగింది.

గ్రామాలలో రైతులు వాణిజ్య పంటలు సాగుచేసి ధనవంతులయ్యారు. వారి జీవనశైలి మారింది. విద్యా సదుపాయాల అభివృద్ధితో గ్రామీణ భారతంలో పార్లమెంటరీ రాజకీయాలకు ఇతోధిక ఆదరణ లభించింది. పరిశ్రమల ప్రైవేటీకరణతో కార్మిక వర్గం సైతం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఆదరించింది. కొత్త సాంకేతికతలు, మేనేజ్‌మెంట్ పద్ధతులతో పట్టణీకరణ విస్తరించింది. మొత్తంమీద భారతీయ సమాజం పెట్టుబడిదారీ విధానాన్ని అంగీకరించింది. నగరాలు, పట్టణాలు, గ్రామాలలో ప్రజల ఆలోచనారీతులు మౌలికంగా మారిపోయాయి. ఆస్తుల ఆర్జనకు, బిడ్డల చదువులకు ప్రాధాన్యం పెరిగింది. మార్క్సిస్టులు బూర్జువా విప్లవంగా పేర్కొనే పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం సువ్యవస్థితంగా సుస్థిరమయింది. ఇదిలా వుంటే నక్సలైట్లు తమ పాత విప్లవ విధానాలనే కొనసాగించారు. ఫలితంగా రైతు కూలీల మద్దతును పొందడంలో విఫలమయ్యారు. ఈ కారణంగా వారికి అరణ్యవాసం అనివార్యమయింది. అడవి బిడ్డలు అయిన ఆదివాసీల మద్దతుతో విప్లవ సాధనకు నక్సల్స్ పూనుకున్నారు. ఆదివాసీల చైతన్యశీలత తమ భూములను ఆక్రమించుకున్న మైదాన ప్రాంతాల రైతులు, వడ్డీ వ్యాపారస్తులు, అటవీశాఖ అధికారులకు వ్యతిరేకంగా సంప్రదాయ పద్ధతులలో పోరాడేందుకు పరిమితమయింది. తుపాకులతో నక్సల్స్ చేసే పోరాటాలు గిరిజనుల మన్ననలు పొందలేకపోయాయి. మైదాన ప్రాంతాల నక్సలైట్ నాయకులే అడవులలోనూ ప్రధాన నాయకులుగా కొనసాగారు. అమాయకులు అయిన ఆదివాసీలు తమ ప్రాంతాలలో జరుగుతున్న వినూత్నరీతుల పోరాటాల గురించి తమలో తాము చర్చించుకున్నారు. పోలీసులు నక్సల్స్ ఉద్యమ వివరాలను గురించి ఆదివాసీల నుంచే తెలుసుకున్నారు. నక్సలైట్ ఉద్యమం తమకు అనుకూలమైనదనే వాస్తవం సైతం ఆ అమాయక ఆదివాసీలకు తెలియదు. కొంతమంది ఆదివాసీలను ఇన్ఫార్మర్లు అనే అభియోగంతో నక్సలైట్లు కాల్చివేయడం జరిగింది. అదే సమయంలో నక్సల్స్ సానుభూతిపరులు అనే మిషతో అమాయక అడవి బిడ్డలను పోలీసులు నానా విధాలుగా హింసించడం, వేధించడం జరిగింది.

నక్సలైట్ ఉద్యమం పరిపూర్ణ ప్రజా ఉద్యమంగా పరిణమించలేదు. తుపాకీ పట్టిన యువజనులు, రాజ్య వ్యవస్థ భద్రతా బలగాల మధ్య సాయుధ పోరాటంగా మారిపోయింది. నక్సలైట్ ఉద్యమాన్ని శాంతిభద్రతల సమస్యగా ప్రభుత్వం పరిగణించింది. పట్టణాలు, నగరాలలో నక్సల్ ఉద్యమానికి మద్దతునిస్తున్నవారు విప్లవ భావనను ప్రచారం చేస్తూ యువజనులను ఆ ఉద్యమంలో చేరేందుకు ప్రోత్సహించారు. ఇటువంటి రాజకీయ వాతావరణం నుంచి ప్రభవించిందే పౌర హక్కుల ఉద్యమం. పలువురు బుద్ధిజీవులు నక్సలైట్ మేధావులుగా పేరు పొందారు. పట్టణాలు, నగరాలలోని నక్సల్స్ మద్దతుదారులు మార్క్స్, లెనిన్ గురించి మాట్లాడటం మినహా ఎలాంటి విప్లవ సిద్ధాంతాన్ని అభివృద్ధిపరచలేదు. ప్రపంచ చరిత్రలోనే ఒక మహోన్నత స్ఫూర్తిదాయక జాతీయోద్యమం నుంచి స్వతంత్ర భారతదేశం ప్రభవించింది. సార్వత్రిక వయోజన ఓటుహక్కు పునాదిగా ప్రజాస్వామ్య వ్యవస్థను అభివృద్ధిపరచుకున్నది. రైతులు, రైతు కూలీలు, దళితులు, ఆదివాసులు, వెనుకబడిన కులాలవారు క్రమేణా ఈ ప్రజాస్వామ్య స్రవంతిలో సంలీనమయ్యారు. దళితులు, గిరిజనులు, బీసీలకు సామాజిక న్యాయాన్ని సమకూర్చేందుకు రాజ్యాంగబద్ధమైన భరోసాలు కల్పించారు. నక్సలైట్లు సాధన చేస్తున్న విప్లవం రాజ్య వ్యవస్థపై భారీ ఎత్తున ప్రజల తిరుగుబాటుగా రూపుదాల్చలేదు. నక్సలైట్ ఉద్యమాలు యాభై సంవత్సరాలుగా ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని గానీ, పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థను గానీ ప్రభావితం చేయలేకపోయాయి. అయితే తమ సైద్ధాంతిక విశ్వాసాలకుగాను ఎంతో మంది నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయారు. ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థలు సామ్యవాద సమాజాల నిర్మాణానికి ఆస్కారం కల్పిస్తాయా? సంశయాస్పదమే. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య దేశాలు అన్నీ మితవాద విధానాల వైపు మొగ్గుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలను కార్పొరేటీకరణ చేస్తున్నాయి. ఇది ఘనీభవించిన యథార్థం. నక్సలైట్లు తమ ఆయుధాలతో రాజ్యానికి లొంగిపోయి పునరావాసం పొందడానికి ప్రయత్నించాలి. లొంగిపోయిన నక్సల్స్‌కు సౌకర్యవంతమైన పునరావాసం కల్పిస్తామనే హామీతో వారిని పార్లమెంటరీ ప్రజాస్వామిక మార్గం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

# ఓబీసీల చరిత్రను ఆర్ఎస్ఎస్ చెరిపేసింది

మొదటిపేజీ తరువాయి

ఆ పొరపాటును ఇప్పుడు సరిదిద్దుకోవాలని అనుకుంటున్నా. సమస్యలు సరిగా అర్థం చేసుకుంటేనే పరిష్కారం సాధించగలం. అందుకోసం చరిత్ర తెలుసుకోవాలి. దేశంలో దళితుల చరిత్రను అంబేద్కర్ అర్థం చేసుకున్నారు. ఓబీసీల చరిత్ర ఎక్కడుంది. భాజపా , ఆర్ఎస్ఎస్ ఉద్దేశపూర్వకంగా ఆ చరిత్రను చెరిపేశాయి” అని రాహుల్ గాంధీ మండిపడ్డారు.

“ఓబీసీలు ఉత్పాదకశక్తికి ప్రతీకలు. కానీ, వారి శ్రమకు తగిన ఫలితాలను అందుకోలేకపోతున్నారు. అన్ని రంగాల్లో వివక్ష ఎదుర్కొంటున్నారు. కార్పొరేట్ ఇండియాలో ఓబీసీలు ఎక్కడున్నారు? మీడియా రంగంలో వారికి స్థానం ఎక్కడుంది? కుల గణన కూడా ఎప్పుడో చేయాల్సింది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మేం తప్పకుండా కులగణన పూర్తిచేస్తాం” అని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు.

### ప్రాంతీయ భాష ముఖ్యమే కానీ..

ఈ సందర్భంగా భాషా వివాదంపైనా రాహుల్ స్పందించారు. “అభివృద్ధిలో విద్యే ప్రాధాన్యం. ఇంగ్లిష్ నేర్చుకుంటే అవకాశాలు రెట్టింపు అవుతాయి. భాజపా నేతలు మాత్రం ఇంగ్లిష్‌ను వ్యతిరేకిస్తున్నారు. ప్రాంతీయ భాషలూ ముఖ్యమే. దానితో పాటు ఆంగ్ల ప్రాధాన్యాన్నీ అర్థం చేసుకోవాలి” అని రాహుల్ వ్యాఖ్యానించారు.

# ‘ఒక చాయ్ వాలా.. మరో చాయ్ వాలాకు’:

మొదటిపేజీ తరువాయి

ఈసందర్భంగా ఆ దేశ పీఎం స్టార్మర్ నివాసం ఉన్న చెకర్స్‌లో ఓ ఆసక్తకర ఘటన చోటు చేసుకొంది. అక్కడి ప్రధాని నివాసంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన చిన్న స్టాల్‌లో మోదీ, స్టార్మర్‌లు చాయ్ తాగారు. దానిని అఖిల్ పటేల్ అనే భారతీయ మూలాలు ఉన్న కుర్రాడు ఏర్పాటుచేశాడు. ప్రధాని మోదీ కి కప్పులో టీ ఒంపుతూ..‘ఒక చాయ్ వాలా మరో చాయ్‌వాలాకు’ అని వ్యాఖ్యానించాడు.

ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల నుంచి డిగ్రీలు అందుకొన్నాక టీ వ్యాపారం మొదలుపెట్టాడు. అఖిల్ పటేల్ లింక్డ్ ఇన్ బయో ప్రకారం అతడు హాంప్‌స్టెడ్‌లో యూనివర్శిటీ కాలేజీ నుంచి పట్టా పొందాడు. ఇక బీఎస్సీ, మేనేజ్‌మెంట్ పట్టాను లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్సెస్ నుంచి అందుకొన్నాడు. ఆ తర్వాత కొన్ని కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసి.. డేటా అనలిస్ట్‌గా ఉద్యోగంలో చేరాడు.

### లద్దాఖ్ ట్రిప్ మార్చేసింది..

2018లో లద్దాఖ్ ట్రిప్ అఖిల్ జీవితాన్ని మార్చేసింది. అతడికి ఎప్పటినుంచో టీ తాగే అలవాటు ఉన్నా.. అక్కడ మాత్రం చాయ్‌ను ఓ సంప్రదాయం లేదా ఆచారంలా తాగడాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఆ తర్వాత 2019లో అతడు ‘అమలా’ అనే బ్రాండ్ పేరుతో రకరకాల చాయ్‌లను తయారుచేయడం ప్రారంభించాడు. దీనికి తన మామ్మ నుంచి స్ఫూర్తి పొందినట్లు పేర్కొన్నాడు. తాను వినియోగించే టీ, ఇతర సుగంధ ద్రవ్యాలను కొనుగోలు చేయడానికి భారత్‌లోని అస్సాం, కేరళలో స్వయంగా పర్యటించి రైతులను కలిశాడు. సన్నకారు రైతుల నుంచి నేరుగా వాటిని కొనుగోలు చేయడం మొదలుపెట్టాడు. తమ సంస్థ పంపిణీ వ్యవస్థ నుంచి మధ్యవర్తులను దూరం పెట్టాడు. దీంతో రైతులకు కూడా మంచి లాభాలు అందాయి. సేంద్రియ ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. ఈ విషయాన్ని బ్రిటిష్ మ్యూజియం చేసిన ఓ వీడియోలో కూడా పేర్కొంది. మే నెలలో అఖిల్, అతడి మామ్మ ఫొటో బ్రిటిష్ మ్యూజియం ఇన్‌స్టా కవర్‌గా ఉంది.

# భారత్ అత్యంత అప్రమత్తంగా ఉండాలి: సీడీఎస్ అనిల్ చౌహాన్




భారత్ 365 రోజులూ, 24 గంటలూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీడీఎస్ అనిల్ చౌహాన్ హెచ్చరించారు. ఆయుధాలు, ఇతర పరిజ్ఞానం గురించి మిలిటరీ పూర్తిగా అప్‌డేట్ అయి ఉండాలని అభిప్రాయపడ్డారు. యుద్ధాల గతి మారిపోతోందని సీడీఎస్ వెల్లడించారు. భవిష్యత్తులో దళాల్లో ఇన్ఫో-టెక్‌తో పాటు స్కాలర్ వారియర్స్ కలగలిసి ఉంటాయన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని గుర్తు చేశారు. సుబ్రతోపార్క్‌లో జరిగిన డిఫెన్స్ సెమినార్‌లో ఆయన ప్రసంగించారు.

యుద్ధాల్లో రన్నరప్‌లు ఉండరని సీడీఎస్ గుర్తు చేశారు. అందుకే సైన్యాలు అప్రమత్తంగా ఉంటూ.. ఏ క్షణమైనా ఆపరేషన్లు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. దీనికి ఆపరేషన్ సిందూర్‌నే ఆయన ఉదాహరణగా చూపారు. భారత మిలిటరీకి భవిష్యత్తులో ఇన్ఫర్మేషన్ వారియర్స్, టెక్నాలజీ వారియర్స్, స్కాలర్ వారియర్స్ అవసరం చాలా ఉందని చెప్పారు. మారుతున్న పరిణామాల ఆధారంగా.. భవిష్యత్తు సైనికులు ఈ మూడు నైపుణ్యాల కలబోతగా ఉంటారని పేర్కొన్నారు. సైనిక దళాల్లో జరుగుతున్న మార్పుల మూడో విప్లవం కీలక దశలో మనం ఉన్నట్లు వెల్లడించారు. దానిని తాను కన్వర్జెన్సీ యుద్ధంగా అభివర్ణిస్తానన్నారు. ఇది కైనటిక్, నాన్-కైనటిక్ మిశ్రమంగా ఉంటుందన్నారు.ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్.. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ క్రమంలో రావల్పిండి, పీవోకే సహా పలు ప్రాంతాల్లోని టెర్రర్ క్యాంప్‌లను ధ్వంసం చేసింది. ఈ క్రమంలో పాకిస్థాన్‌కు చెందిన ఆరుకుపైగా వైమానిక స్థావరాలు కూడా ధ్వంసం అయ్యాయి. కొన్ని చోట్ల రెండు నెలలు దాటినా వాటి మరమ్మతులు ఇప్పటికీ పూర్తికాలేదు.

## టేకాఫ్ అయిన 18 నిమిషాలకే.. ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం




గగనతలంలో ఉండగా ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. జైపుర్ నుంచి ముంబయి వెళ్తున్న విమానం టేకాఫ్ అయిన 18 నిమిషాలకే సాంకేతిక సమస్య తలెత్తినట్లు గుర్తించిన పైలట్లు దాన్ని వెనక్కి మళ్లించారు. దాంతో అది బయల్దేరినచోటే ల్యాండ్ కావాల్సి వచ్చిందని విమానాశ్రయ వర్గాలు వెల్లడించాయి. అయితే విమానంలో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారన్న విషయం ఇంకా తెలియరాలేదు.

ఇటీవలి కాలంలో ఎయిరిండియా విమానాలు తరచూ వార్తల్లో నిలుస్తోన్న సంగతి తెలిసిందే. దీంతో ప్రయాణికులు భద్రత విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల 188 మంది ప్రయాణికులు, సిబ్బందితో ఉన్న ఎయిరిండియా విమానం లో సాంకేతిక సమస్య తలెత్తినట్లు అధికారులు పేర్కొన్నారు. మరో ఘటనలో బుధవారం హాంకాంగ్ నుంచి దిల్లీ విమానాశ్రయానికి వచ్చిన ఎయిరిండియా విమానం 315 ల్యాండింగ్ అయిన కాసేపటికే పవర్ యూనిట్‌లో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది ప్రయాణికులను వెంటనే కిందకు దించేయడంతో పెను ప్రమాదం తప్పింది.

# కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

కౌలు రైతులకూ పెట్టుబడి సాయం చేస్తామని ఇప్పటికీ అమలు చేయలేదు”అని కేటీఆర్ విమర్శించారు.ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా లింగంపేటలో దళితుడైన మాజీ ఎంపీపీ ముదాం సాయిలును పోలీసులు బట్టలు ఊడదీసి అవమానించారని, అతనికి జరిగిన అవమానం తెలంగాణలోని దళితులందరికీ జరిగిందని కేటీఆర్ అన్నారు. అవమానం జరిగిన సాయిలుకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం సాయిలు ఇంటి వద్ద కేటీఆర్ భోజనం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు నల్లమడుగు సురేందర్, గంప గోవర్ధన్, బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు ముజీబుద్దిన్, మాజీ జెడ్పీ చైర్మన్ రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌కు ఎస్తోనియా సహకారం తీసుకుంటాం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: డ్రోన్ టెక్నాలజీలో తెలంగాణ గణనీయ అభివృద్ధి సాధించిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో తయారైన డ్రోన్లు ‘ఆపరేషన్ సిందూర్’లో పాకిస్థాన్‌కు భారీ నష్టం కలిగించాయని చెప్పారు. ఎస్తోనియా దేశ రాయబారి మ్యారియే లూప్ ఆధ్వర్యంలో ఆ దేశ వాణిజ్య ప్రతినిధుల బృందంతో సచివాలయంలో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ-గవర్నెన్స్, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌లో ప్రపంచంలోనే అద్భుత ప్రగతి సాధించిన ఎస్తోనియా సహకారం తీసుకుంటామన్నారు. వాణిజ్యం, ఏఐ సాంకేతికత, సైబర్ సెక్యూరిటీలో కూడా కలిసి పనిచేయాలని ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని మంత్రి కోరారు.

ఫుడ్ ప్రాసెసింగ్, బ్రాండెడ్ మద్యం ఉత్పత్తి రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉందని.. తమతో కలిసి పనిచేసే విషయాన్ని పరిశీలించాలని మంత్రి సూచించారు. సెప్టెంబరులో తమ దేశం సందర్శించాలని శ్రీధర్‌బాబును ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ కోరారు. తమ అధికారుల బృందం వచ్చి.. విద్య, ఈ-గవర్నెన్స్, ఏఐ, రోబోటిక్స్‌లో పరస్పరం సహకారంపై చర్చిస్తుందని మంత్రి తెలిపారు. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక సీఎస్ సంజయ్ కుమార్, మీ సేవ కమిషనర్ రవికిరణ్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు రఘునందన్ పాఠాలు అవసరం లేదు: ఆది శ్రీనివాస్

మొదటిపేజీ తరువాయి

“మా పీసీసీ అధ్యక్షుడు బీసీ బిడ్డ. మరి మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరు?బీసీలకు పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలని మీ అధిష్ఠానాన్ని ఎందుకు డిమాండ్ చేయట్లేదు? మేం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం. భవిష్యత్తులో అన్ని అవకాశాలు కల్పించి తీరుతాం. బీసీ బిడ్డ కాకపోయినా మా సీఎం రేవంత్‌రెడ్డి బీసీ బిల్లు తీసుకొచ్చారు. కాంగ్రెస్‌కు రఘునందన్‌రావు పాఠాలు అవసరం లేదు. సామాజిక న్యాయం అంటేనే కాంగ్రెస్. మీ వల్ల కాకపోతే రాహుల్ గాంధీ ప్రధాని అయ్యాక బిల్లును ఆమోదించుకుంటాం”అని ఆది శ్రీనివాస్ అన్నారు.

# ఏపీ, తెలంగాణలో

### నియోజకవర్గాల పునర్విభజనపై పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజనపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 2022లో ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్‌సింగ్ ధర్మాసనం తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. జమ్మూకశ్మీర్‌లో పునర్విభజన చేసే సమయంలో ఏపీ విభజన చట్టాన్ని పక్కన పెట్టి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. 170(3) అధికరణం ప్రకారం ఏపీ విభజన చట్టంలో సెక్షన్ 26కి పరిమితి ఉందని తెలిపింది. 2026లో మొదటి జన గణన తర్వాత మాత్రమే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా చెప్పారని పేర్కొంది.ఇలాంటి వ్యాజ్యాన్ని అనుమతించడం వల్ల ఇతర రాష్ట్రాల్లో కూడా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న వ్యాజ్యాలు వరదల్లా వస్తాయని, గేట్లు తెరిచినట్లు అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. కేంద్ర పాలిత ప్రాంతాలతో పోల్చినప్పుడు రాష్ట్రాలలో డీలిమిటేషన్‌కు సంబంధించిన నిబంధనలు భిన్నంగా ఉంటాయని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.జమ్మూకశ్మీర్‌పై ప్రత్యేక దృష్టి సారించారన్న పిటిషనర్ వాదనను న్యాయస్థానం తిరస్కరించింది. జమ్మూకశ్మీర్ కోసం జారీ చేసిన నియోజకవర్గాల పునర్విభజన నోటిఫికేషన్ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణను మినహాయించడం.. ఏకపక్షం, వివక్ష కాదని స్పష్టం చెప్తూ పురుషోత్తం రెడ్డి పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేసింది.

## వరంగల్ ఎయిర్‌పోర్టు.. భూసేకరణకు నిధులు విడుదల



వరంగల్: వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్టు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.205 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మామునూరు వద్ద కొత్త బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు మార్చి నెలలో పచ్చజెండా ఊపారు. ఈ విమానాశ్రయానికి అన్ని అనుమతులు ఇస్తూ.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఏఏఐ) నిర్మాణం ప్రారంభించడానికి వీలుగా సంబంధిత దస్త్రంపై సంతకం చేశారు. మరో 253 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇస్తే కొత్త విమానాశ్రయ నిర్మాణం మొదలుపెడతామని కేంద్రమంత్రి ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే భూసేకరణ కోసం ప్రభుత్వం తాజాగా నిధులు విడుదల చేసింది.

# నిచ్చెన మెట్ల సమాజం ..
# గొడ్డలి పోట్ల అరుపులు

**మర్రి శంకరయ్య, అకాడమిస్ట్ హైద్రాబాద్**

మన భారత దేశం దాదాపు 800 ఏళ్లు విదేశీ ఆక్రాంతలైన ముస్లింల పాలనలో, 200 ఏళ్ల పైబడి విదేశీ ఆక్రాంతలైన క్రైస్తవుల పాలనలో మగ్గింది.వీళ్లు అక్కడి అనాగరిక పాలనా రీతులను మనదేశంలో అమలు చేసి మనదేశ సామాజిక చిత్రాన్ని చెరిపే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.ఆధునిక సిద్ధాంతాల భ్రమలో కొందరు వీరికి వంత పాడుతూ వచ్చారు. ఇంకా బానిస సేవలు చేస్తున్నారు.ఈ పరిణామాలను ఇప్పుడు సామాన్య భారతీయుడు కూడా ప్రశ్నిస్తున్నాడు. వీరి అజ్ఞాన అనాగరిక కుట్రలను తిప్పి కొడుతున్నారు.మన దేశ సామాజిక వర్గ నిర్మాణాన్ని ఒకసారి తెలుసుకుందాం...ఇక్కడ కులం అని చేస్తున్న పద ప్రయోగం ఒక వృత్తికి సంబంధించినది.మేకల మందకు ఒక యజమాని ఉంటాడు...ఆ మందను మేపడానికి అదే కులం వ్యక్తి ఇంకొకడు ఉంటాడు..ఇద్దరి బాధ్యతలు వేరు వేరుగా ఉంటాయి.ఈ పని విభజన వల్ల మెల్ల మెల్లగా మరో ఉపకులం రూపు దిద్దుకుంది అని లోతైన పరిశీలన చేసిన ఒక మాజీ వామపక్ష వాది చెప్పారు.ఆయన ఇప్పుడు కమ్యూనిజం ఎంతటి పెద్ద బండ రాయో దేశానికి అర్థం చేయిస్తున్నారు. అర్థం చేసుకోండి.

**- అలాగే ప్రతి కులంలోనూ దాని ఆశ్రిత కులం...దానిలోనే ఒక పండిత పూజారి ఉపకులం...భిక్షుక ఉపకులం కూడా ఉంటుందట**

ఈ భిక్షుక ఉపకులం పని ఏమిటి అంటే...అన్ని



భౌగోళిక భిన్నత్వం .. జీవన విలువల ఏకత్వం
భారత దేశ విశేషత

రకాల పండుగలు...శుభ అశుభ కార్యాల సమయాల్లోనూ ....ఆ కులం యొక్క మూల పురుషుల గురించి...విద్వాంసులు మేధావుల గురించి కళా రూపంలో చెప్పి రావడం.ఊరూరా తిరుగుతూ...ఆ కులం యొక్క గోత్రం...ఆ కులానికి మూల పురుషుడైన ఋషి.. అతడు ఎలా రామాయణ భారతాది కాలాల నుంచీ ఉన్నాడో చెబుతూ..తత్వాన్ని ధర్మాన్ని బోధించేవారట...అంటే ఒకే కులంలో పుట్టినా....కొందరు వారి రుచి రీత్యా...ఆలోచన అభ్యాసం రీత్యా సంచారం చేసే వారిగా మారి ...సంస్కృతి సభ్యతలు నేర్పి వచ్చేవారు... ఇంతగా స్పష్టమైన నిర్వచించబడిన నియోగించబడిన పనుల్లో నిమగ్నమై పోయిన వారిని ఎవరు సమన్వయం చేసేవారు ?

**- వారే..మఠాధిపతులు...పీఠాధిపతులు... అఖాడాల అధిపతులు**

అందుకే పెళ్లిళ్లలో శుభ అశుభ కార్యాల్లో ప్రతి ఒక్కరినీ ఏదో ఒక సందర్భంలో భాగస్వామ్యం అయ్యేలా...ఎవరు ఎవర్నీ మరిచిపోకుండా చేసేలా ఆచార వ్యవహారాలు రూపుదిద్దుకునేవి.భారతీయ హిందూ సనాతన వ్యవస్థలో...వృత్తి నిబద్ధతతో బాటు...ఆరోగ్య స్పృహ కూడా బాగా ఉండేది...

**- సంచారం చేసి వచ్చే వాళ్ళని కొంత కాలం క్వారంటైన్ లో ఉంచేవారు**

వాళ్ళు మళ్ళీ ఈ వాతావరణంలో ఇమిడేవరకూ...వాళ్ళు దేశాటన చేసిన సమయంలో సోకిన వివిధ వైరస్ లు నశించి సాధారణ స్థితికి వచ్చేవరకూ అంటు కోకుండా ఉండేవారు.ఇది అంటరానితనం కాదు.సాధు సంతులను ఎలా దూరంగా తాకకుండా ఉంటారో వీరినీ అంతే దూరంగా తాకకుండా చూసేవారు.ఒకరిని తాకకపోతే అంటరానితనం..ఇంకొకరిని తాకకపోతే గొప్పతనం ఎలా అవుతుంది ? అడవుల్లో సంచరించి వచ్చేవారి రోగ నిరోధక శక్తికి...మైదానాల్లో ఉండేవారి రోగ నిరోధక శక్తికి తేడా ఉంటుంది...

**- అది ఎక్కువ తక్కువ చూడడాలు ఎలా అవుతాయి**

విదేశీ యానం చేసి వచ్చినవాడు...ఒక్క రోజులో వాతావరణ వ్యవహార ఆహార మార్పులను ఎలా తట్టుకుంటాడు ?

**- ప్రపంచంలో ఎక్కడా లేని వాతావరణ, జీవ, ఆహార వైవిధ్యం భారత దేశంలో ఉంది**

మంచు ప్రదేశంలో ఉన్న వాడు గర్భగుడిలో కోటు ధరించి పూజాదికాలు చెయ్యాలి. ఇది ఆ ప్రాదేశిక సూత్రం.దక్షిణంలో తుండు గుడ్డ మొలకు కట్టుకుని, చిన్న ఉత్తరీయంతో పూజ చెయ్యాలి.ఎవారైనా మన దక్షిణ భారతం నుండి వెళ్ళి, అక్కడ పూజ చూసి...ఇదేంటి కోటుతో పూజ చేస్తున్నారు?.ఇది శాస్త్ర విరుద్ధం అంటే ఏం చెయ్యగలం.ఇంక ఎడారి ప్రాంతాల్లో పుట్టి పెరిగి ఇసుక తిప్పల్లోనే జీవితం చూసిన వారు.. లేదా సంవత్సరంలో పది నెలలు మంచులోనే బ్రతికి వచ్చిన విదేశీయులకు ఈ వైరుధ్యాలు అంతు బట్టదు, అర్థం కాదు.వాళ్ళ వాళ్ళ జీవన చిత్రాన్ని మన ప్రాంత జీవితానికి అన్వయించలేరు.ఇలా గతంలో విదేశీ ఆక్రాంతలు, వాళ్ళ ఫ్రేములో వాళ్ళ మౌల్డులో ఇక్కడి సిస్టమ్ ను ఇరికించాలని చూసారు.

**- ఆ చట్రంలో మన సామాజిక వ్యవస్థ ఇమడకపోతే నిచ్చెన మెట్లు...గొడ్డలి పోట్లు అంటూ కథలు ప్రారంభించారు**

ఎర్రటి ఎండలో కోటు టై కట్టుకుని ప్రార్థనలు చేసే పాస్టర్లు కోస్తా తీరంలో కనబడతారు.చలి దేశపు వగలు వయ్యారాలు ఇక్కడ ప్రదర్శించి నాగరికత అనే భ్రమలో కాలం గడుపుతారు.అందరూ గొర్రెల కాపర్లు అయిపోతే సమానత్వం వచ్చేసినట్టు అనే అజ్ఞానం.

**- మక్కా దర్శనం తెల్లటి వస్త్రాలు, అంగ వస్త్రంతో చేస్తారు, చెయ్యాలి**

మరి వేడిమి ప్రదేశంలో నల్లటి బురఖాలు ధరింప జేయడం ఏ సైన్సు కరెక్టు అని చెబుతుంది ? కాబట్టి, సర్వ కాల సర్వావస్థల్లోనూ ఏదో ఒక్కటే సరైనది ఉండదు, మార్పులు వస్తూనే ఉండాలి.దాన్ని అంగీకరించింది సనాతనం.ఆచరిస్తున్నది సనాతనం.అందుకే సనాతనం నిత్య నూతనం గా విలసిల్లుతున్నది.అందుకే సనాతనం ఇంతలా వ్యాపితం అయ్యింది.వేర్లూనుకుని నిలబడింది.ఒకే పుస్తకం ఒకే దేముడు అని పట్టుకుని కూర్చున్న వాళ్ళు మూరు?లు మూఢులు కాక మరేమిటి? వైరుధ్యాన్ని వైవిధ్యాన్ని అంగీకరించి, ఒక్కటిగా స్పందించే ధర్మం,మార్పులను అంగీకరించే హిందూత్వం తక్కువది ఎలా అవుతుంది ? సనాతనం విమర్శను తీసుకుంటుంది,మార్పును అంగీకరిస్తుంది, తర్కిస్తుంది సత్యాన్ని నిల్పుకుంటూనే పయనిస్తుంది. అయితే ఇది భగవంతుడు తన కోసం సృష్టించుకున్న భారత్ లో మాత్రమే సాధ్యం.ఆ విశిష్టత భారత దేశం స్వంతం.

**- ఈ దేశంలో పుట్టినందుకు గర్వించే వాడే,ఈ జాతీయుడే అసలైన విశ్వ కళ్యాణ వాది,మానవతావాది**

**- గర్వ సే కహెూ..హమ్ హిందూ హై**
**జై హింద్**

# యూట్యూబ్ సలహాలతో ప్రాణాలు కోల్పోయిన యువకుడు

- డాక్టర్ లేదా నిపుణుల సలహాలు పాటించాలి
- యూట్యూబ్ చూసి ఆహార నియమాలు పాటిస్తే ప్రమాదం

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి.**

బరువు తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా యూట్యూబ్‌లో చూసి ఆహార నియమాలు పాటించిన పదిహేడేళ్ల యువకుడు శక్తిశ్వరన్ మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన తమిళనాడులోని కొలాచెల్ ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.పోలీసుల విచారణలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. శక్తిశ్వరన్ గత మూడు నెలలుగా పలు




యూట్యూబ్ ఛానళ్లను అనుసరిస్తూ కఠినమైన ఆహార నియమాలు పాటించినట్లు పోలీసులు గుర్తించారు. అతను ఆహారం తీసుకోకుండా కేవలం నీరు, పళ్ల రసాలు మాత్రమే తీసుకుంటున్నాడని కుటుంబ సభ్యులు విచారణలో తెలిపారు.శక్తిశ్వరన్ ఆహార నియమాలు పాటించే ముందు వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోలేదని తల్లిదండ్రులు పోలీసులకు వెల్లడించారు. కేవలం యూట్యూబ్ వీడియోల్లోని సూచనలనే అతను పాటించాడని వారు తెలిపారు. బరువు తగ్గడానికి వ్యాయామం కూడా చేస్తున్నాడని, కొన్ని మాత్రలు వాడుతున్నాడని చెప్పారు.గురువారం నాడు శక్తిశ్వరన్ ఒక్కసారిగా ఊపిరి ఆడక ఇంట్లో కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతనిని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతని మృతికి గల కారణాలు తెలుసుకోవడానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# చలో వేములవాడ

## - శామీర్ పేట్ కు చేరిన మున్నూరు కాపు ర్యాలీ



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

మేడ్చల్ నియోజకవర్గం శామీర్ పేట్ మున్నూరు కాపుల సమస్యల పరిష్కారానికి, ఐఖ్యతకు కృషి చేస్తామని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం రావు తెలిపారు. నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం రావు తలపెట్టిన చలో వేములవాడ ర్యాలీ సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై శుక్రవారం శామీర్ పేట్ కు చేరుకుంది.

# గోడపైకి కారు ఎక్కించిన వ్యక్తి

## - పైలట్ గా మారిన కారు చోదకుడు


**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

- మేడ్చల్-దుండిగల్ పీఎస్ పరిధిలోని శంభీపూర్‌లో ఘటన
- నిద్రమత్తులో డ్రైవింగ్ చేస్తూ వచ్చిన డ్రైవర్ కారును ఇంటి గోడపైకి ఎక్కించిన వైనం
- కారును క్రేన్ సహాయంతో దింపిన ట్రాఫిక్ పోలీసులు

నిద్రమత్తులో రోడ్డు ప్రమాదాలు జరగడం సర్వసాధారణం. అలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతూనే ఉంటాయి. కానీ, ఓ డ్రైవర్ నిద్రమత్తులో కారును ఏకంగా ఇంటి గోడపైకి ఎక్కించాడు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దీని తాలూకు వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.శంభీపూర్‌లో నిద్రమత్తులో డ్రైవింగ్ చేస్తూ వచ్చిన డ్రైవర్ కారును ఇంటి గోడపైకి ఎక్కించాడు. ప్రమాదం జరిగిన సమయంలో భారీ శబ్ధం రావడంతో ఇంటి యజమానులు నిద్రలేచి బయటకు వచ్చి చూశారు. ఇంటి బయట కనిపించిన దృశ్యం చూసి వారు నివ్వెరపోయారు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో వెంటనే ప్రమాదస్థలికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు క్రేన్ సాయంతో కారును కిందకు దింపారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలయింది.గోడమీది పిల్లిని చూసాం..కానీ గోడమీది కారును చూడడం మొదటిసారి అని కొందరు..విమానం నడిపే పైలట్ అలవాటుగా కారును గాల్లో లేపాడని కొందరు నెటిజన్లు తమదైనశైలిలో ఫన్నీగా కామెంట్స్ చేస్తున్నారు.

# 1, 116 చీరలతో నిమిషాంబ అమ్మవారికి అలంకరణ

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



శ్రావణమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని బోడుప్పల్ లోని శ్రీ మాత నిమిషాంబ దేవి ఆలయంలో లక్ష్మీశోభ నెలకొంది. అమ్మవారికి 1, 116 చీరాలతో విశేష అలంకరణ చేశారు. అమ్మవారు దేదీప్యమానంగా వెలుగుతూ, దీపాకాంతులతో ఉజ్వలంగా ప్రకాశిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించింది. అమ్మవారు ఈ ఆదివారం వరకు ఇదే అలంకరణలో దర్శన భాగ్యం కల్పిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# ఘట్ కేసర్ లో ఇంజినీరింగ్ విద్యార్థి సూసైడ్

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



ఘట్ కేసర్ రైల్వే స్టేషన్ పరిధి యమ్నంపేట రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు కింద పడి రాజేందర్ అనే ఇంజినీరింగ్ విద్యార్థి సూసైడ్ చేసుకున్నాడని పోలీసులు శుక్రవారం తెలిపారు. యాదాద్రి జిల్లా మోత్కూర్ మండలం మానాయిగూడెం వాసి రాజేందర్ యమ్నంపేటలోని ఎస్సిడిడి హాస్టల్లో ఉంటూ స్థానిక శ్రీనిధి యూనివర్సిటీలో బిటెక్ 4వ సంవత్సరం చదువుతున్నాడన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, బాడీని గాంధీకి తరలించామని చెప్పారు.

# ఇబ్రహింపట్నం సహకారసంఘం లో విక్రయాలు ఆపాలి

- పురుగు మందులు విక్రయాలు నిలిపివేస్తూ వ్యవసాయ శాఖ ఉత్తర్వులు



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**

జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రం లోని ఇబ్రహింపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో పురుగు మందులు విక్రయాలు అపాలని శు క్రవారం మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ నిలిపివేస్తూ వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారిచేశారు.ఈసందర్భంగా సహకారసంఘం విక్రయకేంద్రం లో అదికారులు తనిఖీ చేసి,ఎరువులు , పురుగుమందుల విక్రయాలకు సంబంధించి రికార్డులను రసీదులను పరిశీలించారు. రైతులకు సాగు చేస్తున్న విస్తీర్ణాన్ని బట్టి మాత్రమే ప్రస్తుత అవసరానికి తగ్గట్టుగా యూరియా విక్రయించాలని, సీజన్ కి సరిపడా యూరియాని విక్రయించకూడదని పురుగుమందులు మరియు కలుపు మందుల విక్రాలకు సంబంధించి రికార్డు మైంటైన్ చేయకపోవడం వలన తాత్కాలికంగా 21 రోజులపాటు పురుగుమందూలకి విక్రయాలు చేపట్టకుండా ఉత్తర్వులు (స్టాప్ సేల్ నోటిస్) జారీ చేయడం జరిగింది.ఈసందర్భంగా ఎఓ మాట్లాడుతూ రైతులు యూరియా అవసరం మేరకే కొనుగులు చేసి కృత్రిమ కోరత సృష్టించకుండా సహకరించాలన్నారు.

# జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ ఉద్యోగుల పునర్నియామకానికి యాజమాన్యం అంగీకారం

- డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో గుర్తింపు కార్మిక సంఘానికి, యాజమాన్యానికి మధ్య కుదిరిన ఒప్పందం



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
సింగరేణి సంస్థలో జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలుగా (జేఎంఈటీ) చేరి వివిధ కారణాలతో టర్మినేట్ అయిన 43 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవడానికి సింగరేణి యాజమాన్యం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ విషయంపై గురువారం హైదరాబాద్ విద్యానగర్ లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో గుర్తింపు కార్మిక సంఘం అయిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కు, సింగరేణి యాజమాన్యానికి మధ్య ఒక ఒప్పందం కుదిరింది. గతంలో ఈ జేఎంఈటీ లు విధులకు గైర్హాజరు కావడం, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించకపోవడం వల్ల విధుల నుంచి తొలగించారు. కాగా వీరి పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించి తిరిగి ఉద్యోగాలు కల్పించాలని సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ 2024 నవంబర్ లో జరిగిన డైరెక్టర్ పా స్థాయి నిర్మాణాత్మక సమావేశంలోనూ, ఆ తర్వాత ఈ ఏడాది మార్చిలో ఛైర్మన్ స్థాయిలో జరిగిన నిర్మాణాత్మక సమావేశంలోనూ అజెండా అంశంగా చేర్చి చర్చించారు. దీనిపై గత జూన్ 27వ తేదీన డైరెక్టర్ పా స్థాయిలో జరిగిన 51వ నిర్మాణాత్మక సమావేశంలో చర్చించి ఒక ద్వైపాక్షిక అంగీకారానికి వచ్చారు. ఆ తర్వాత యూనియన్ ప్రతినిధులు, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో మరోమారు చర్చల అనంతరం త్రైపాక్షిక ఒప్పందానికి అంగీకరించారు. ఒప్పందం కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) డి.శ్రీనివాసులు, సింగరేణి సంస్థ తరఫున డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు, జీఎం సి.పి.పి. ఎ.మనోహర్, జీఎం పర్సనల్ కవితా నాయుడు, హెచ్ ఓడి (ఎంఎస్) రవి బొజ్జా, గుర్తింపు కార్మిక సంఘం తరఫున అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కె.రాజ్ కుమార్, నాయకులు కె.వీరభద్రయ్య, ఎం.సమ్మయ్య, మద్ది ఎల్లయ్య, వై.వి.రావు పాల్గొన్నారు.ఒప్పంద విశేషాలు..టర్మినేట్ అయి పునర్ నియామకం పొందుతున్న 43 మంది జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలకు ఇది తాజా నియామకంగా గుర్తించడం జరుగుతుంది. వీరంతా సంస్థ ఏర్పాటు చేసే హై పవర్ కమిటీ ముందుకు వెళ్లి తమ సర్వీసు విషయాలు, ఓవర్ మెన్ సర్టిఫికెట్, గ్యాస్ టెస్టింగ్ ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లు మొదలైనవి సమర్పించవలసి ఉంటుంది. అనంతరం ఆ కమిటీ సూచన మేరకు మెడికల్ ఫిట్ నెస్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. దాని ఆధారంగా ప్రాథమిక అపాయింట్మెంట్ ఆర్డర్లు జారీ చేస్తారు. తిరిగి ఉద్యోగంలో చేరిన వీరు తమ మొదటి సంవత్సరంలో తప్పనిసరిగా కనీసం 190 మస్టర్లకు తగ్గకుండా విధులు నిర్వహించాలని ఉంటుంది.

## ప్రజలందరూ సురక్షితంగా ఉండాలి

- వర్షాల నేపథ్యంలో జాగ్రత్త లు పాటించండి



**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్.**
కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు 9391942254ఇబ్బందులు ఎదురైతే ఫోన్ చేయండి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లాలో కొనసాగుతున్న వర్షాల నేపథ్యంలో... అత్యవసర పరిస్థితులు ఎదురైన వెంటనే స్పందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్. 9391942254 24/7 పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు భారీ వర్షాల వల్ల వరదలు, ఇళ్లకు నష్టం, రహదారులు ధ్వంసం, చెట్లు కూలిపోవడం వంటి విపత్కర పరిస్థితులు ఎదురైన సందర్భంలో వెంటనే కంట్రోల్ రూమ్‌కు9391942254 సమాచారం అందించాలాని కలెక్టర్ తెలిపారు వర్షాల వల్ల ముంపుకు గురైన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## కాశీలో సేవా చేయుటకు శ్రీవారి సేవా సభ్యులకు అవకాశం



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 25:**
వారాణాసిలోని కాశీ విశ్వనాథుని దర్శించుకొని శ్రీవారి సేవా చేయు ఆసక్తి గల భక్తులు వాలంటీర్లకు 9 రోజులు కాశీలో సేవా చేయటకు, ఇందులో ఐదు లేదా తొమ్మిది రోజులు సేవ చేసేందుకు సభ్యులకు అవకాశం కలదని పెద్దపల్లి జిల్లా తక్కళ్ళపల్లి బసంత్ నగర్ శివరామకృష్ణ భజన మండలి అధ్యక్షులు నేదునూరి సాంబశివరావు తెలిపారు. కాశీ యాత్రకు వచ్చే వారు ప్రయాణ చార్జీలు ఎవరికి వారే భరించాల్సి ఉంటుందని, కాశీలో ఉచిత భోజనము, వసతి, దర్శనం కల్పిస్తామని మరిన్ని వివరాల కోసం 9949465654, 970555 699, 99125 86272 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

# గురుకులాలకు నూతన భవనాలను నిర్మించాలి

- గురుకులాల్లో విద్యార్థులకు రక్షణ లేదు
- గురుకులను పట్టించుకోని ప్రజా ప్రభుత్వం
- ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము






**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జులై 25**
శుక్రవారం రోజున ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హుజరాబాద్ నియోజకవర్గంలో ఉన్న బి సి గురుకుల విద్యాలయాలను, సంక్షేమ హాస్టళ్లలను సందర్శించి విద్యార్థులను వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో నడుస్తున్న మహాత్మ జోతిరావు పూలే గురుకుల సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లకు నూతన భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని, అలాగే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని ప్రస్తుతం ఉన్న వర్షకాలం సందర్భంగా రగ్గులు బెడ్స్ ఇవ్వాలని కోరారు. గురుకులాలు సమస్యలు నిలియంగా మారాయని తరచుగా గురుకులలో ఫడ్ పాయిజన్ లు జరగడం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని, గురుకులాలు ఆపరిశుభ్రంగా ఉండడంవల్ల ఎలుకలు హాస్టల్లోకి వచ్చి విద్యార్థులకు కాట్లు వేస్తున్నాయని, గురుకుల విద్యార్థులకు రక్షణ లేకుండా పోతుందని వారి ప్రాణాలతో ప్రభుత్వం అధికారులు చెలగాటం ఆడుతున్నారని, వీణవంక, సైదాపూర్ మండలాల మహాత్మ జోతిరావు పూలే గురుకుల సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలను నిర్మించాలని సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తుందని, సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించి అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లకు నూతన భవనాలను నిర్మించాలని,లేనిపక్షంలో విద్యార్థులను ఏకం చేసి జిల్లా కలెక్టరేట్ ముట్టడిస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి రాంపెల్లి రోహిత్, నాయకులు గణేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తుల పరిశీలన వేగవంతం..

- రైతు సమస్యలు తీర్చడమే లక్ష్యంగా.పరిశీలన చేస్తున్న తహసీల్దార్ వెంకట్ రెడ్డి







**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జులై 25**
భూభారతి దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేసినట్లు తహసిల్దార్ వెంకట్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండల కేంద్రంలోని కార్యాలయంలో తహసిల్దార్ వెంకట్ రెడ్డి భూ భారతి దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకట్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వము రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం, ప్రవేశపెట్టిన భూభారతి చట్టాన్ని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అమలు చేస్తున్నట్టు తెలిపారు. మండల పరిధిలో గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిర్వహించినట్టు తహసీల్దార్ వెంకట్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాస్ ఆర్ ఐ గడ్డం శంకర్ .సత్యనారాయణ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

# కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఎమ్మెల్యే సుందర్ లక్ష్మారెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువాసిని రెడ్డి కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా.







**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్ల వంటివి పేదల ఆత్మగౌరవం పెంచే కార్యక్రమం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రేషన్ కార్డు ప్రతి ఒక్క పౌరునికి. ప్రామాణికం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.కౌడిపల్లి మండలం రైతు వేదికలో ఆహార భద్రత కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్ల వంటివి పేదల ఆత్మగౌరవం పెంచే కార్యక్రమాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో కౌడిపల్లి మండలం రైతు వేదికలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూనర్సాపూర్ నియోజకవర్గం పరిధిలో ఇప్పటివరకు 2508 కొత్త రేషన్ కార్డులు జారీ చేయగా, వీటితోపాటు 10 వేల 500 మంది సభ్యులను రేషన్ కార్డులలో చేర్చడం జరిగిందన్నారుజిల్లాలో 87,491 మంది రైతులు ఖాతాల్లో 645 కోట్లు రూపాయలు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు నర్సాపూర్ నియోజకవర్గంలో 28,790 మంది రైతుల సంబంధించి 211 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రేషన్ కార్డు ప్రతి ఒక్క పౌరునికి. ప్రామాణికం గా చెప్పుకోవచ్చు అన్నారు ఈనెల 25 నుండి 10వ తారీకు వరకు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం శుభపరిణామం అన్నారు అనేక సంక్షేమ పథకాలకు ఆధారం రేషన్ కార్డు అన్నారు, సీఎంఆర్ఎఫ్ రాజీవ్ ఆరోగ్యశ్రీ వీటన్నిటికీ రేషన్ కార్డు తలమానికమన్నారు వడ్డీ లేని రుణాలు. నర్సాపూర్ నియోజకవర్గంలో మహిళలందరికీ అందించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డిఓ మహిపాల్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ ,తాసిల్దార్ శ్రీనివాస్ సంబంధిత ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చి కొబ్బరితో గుండెకు మేలు



**గజెల్లి రాజేంద్ర ప్రసాద్, సోషల్ అనలిస్ట్ కోరుట్ల**
పచ్చి కొబ్బరితో ఆరోగ్యానికి చాలా లాభాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇందులో విటమిన్ A, B, C, థయామిన్, రైబోఫ్లేవిన్, నియాసిన్, కాల్షియం, కార్బోహైడ్రేట్లు, ఐరన్ వంటి పోషకాలు ఉన్నాయి. పచ్చి కొబ్బరి తినడం వల్ల జీర్ణక్రియను మెరుగుపడుతుంది. మలబద్ధకం, థైరాయిడ్ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. గుండె ఆరోగ్యం బలపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

## పెరాలసిస్ పేషెంట్ కు మందులు అందజేసిన భరోసా స్వచ్ఛంద సంస్థ



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 25:**
రామగుండం హౌసింగ్ బోర్డ్ కు చెందిన గతంలో ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేసి అనారోగ్య కారణాలతో పెరాల్సిస్ కు గురైన గట్టయ్య తన జీవన ప్రయాణం ఇంతటితోనే ఆగిపోవద్దనే ఆత్మబలంతో మేకల కాపరిగా మారి తన జీవన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. తన అనారోగ్య కారణాన్ని దృష్టిలో ఉంచుకొని తనకు మందులు కావాలని పల్లికొండ రాజేష్ కు విషయం తెలియజేయడంతో వెంటనే భరోసా స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ నసీమకు విషయం తెలపడంతో వెంటనే స్పందించిన ఫౌండేషన్ ఆర్గనైజర్ నసీమ రూ.3 వేల విలువగల పెరాలసిస్ కు సంబంధించిన మందులను పేషెంట్ గట్టయ్యకు అందజేశారు. పల్లికొండ రాజేష్ మాట్లాడుతూ మానవత్వానికి ప్రతీకగా భరోసా స్వచ్ఛంద సంస్థ నిలుస్తున్నదని, నిస్సహాయులకు అనేక రకాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో గున్నాల శ్రీనివాస్, మేడి రాజయ్య, మచ్చ సురేష్, మహేష్, బషీర్, ముషీర్, తాజ్ బాబా, పల్లికొండ మల్లయ్య, జమీర్, కల్లెడ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.